క్లుప్తంగా

పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

చర్ల: మండల కేంద్రమైన చర్లలో గతంలో ఉన్న డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని తిరిగి చర్లకు తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ మల్లారెడ్డికి విద్యార్థులు ఫోన్ చేసి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరిన సందర్భంలో మల్లారెడ్డి విద్యార్థులతో దురుసుగా మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఉన్నత స్థాయి అధికారి అయి ఉండి విద్యార్థులతో దురుసుగా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. చర్లలో డిగ్రీ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసేంత వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కన్వీనర్ మునిగల శివ, నాయకులు బాను ప్రకాశ్, రాజు, మహేష్, గిరిజ, రాణి, భారత్ తదితరులు పాల్గొన్నారు.

డీజీఎంకు ఘన సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ డీజీఎంగా మధన్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, నాయకులు నూతన డీజీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం పది మందితో ఏర్పాటు చేసిన యూనియన్ నూతన ఫిట్ కమిటీ సభ్యులను డీజీఎంకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు డీవీవీ సత్యనారాయణ, బి.రాజలింగు, పి.వీరభద్రం, జి.నరసింహులు, కేదారి, వంకటేశ్వర్లు, నరేష్, వి.శ్రీకాంత్, సురేష్, ఎస్.రవి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం గ్రామంలోని చిన్న అరుణాచలం క్షేత్రంలో వీర బ్రహ్మేంద్ర స్వామి పరివార 45 దేవతా విగ్రహాలను గురువారం వైభవంగా ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మశ్రీ కనసాని నూతన్ ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

దమ్మపేట: రోడ్డు వెంట వెళ్తున్న వృద్ధురాలిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అంకంపాలెంకు చెందిన పెనుబల్లి బుచ్చమ్మ గురువారం రోడ్డుపై వెళ్తుండగా బైక్‌పై నిర్లక్ష్యంగా వచ్చిన వ్యక్తి ఢీకొట్టడంతో ఆమె కాలు విరిగిపోయింది. స్థానికులు పట్వారిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కొత్తగూడెం తరలించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుల కథనం ప్రకారం.. ఇమ్మడి రాంబాబు, కూసాల లక్ష్మీపతి, ధనియాకుల వీరయ్యలకు చెందిన ముడు పాడిగేదెలు ఉదయం మేతకు వెళ్లాయి. మాజీ సర్పంచ్ హనుమాకు చెందిన పంటచేను వద్ద తెగిపడి ఉన్న త్రీఫేస్ విద్యుత్ తీగలకు తగలడంతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.1.90 లక్షలు ఉంటుందని, రైతులకు పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆహార వ్యర్థాలు తిని..

అశ్వాపురం: మండలంలోని అమ్మగారిపల్లిలో సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద ఆహార వ్యర్థాలు తినడంతో ఓ గేదె గురువారం మృతి చెందింది. రైతు నేలపట్ల నాగిరెడ్డికి చెందిన గేదె చనిపోగా, మరో మూడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.

సాయిబాబాకు పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జూనియర్ కాలేజ్ సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పలు రకాల పూజలు, అభిషేకాలు ప్రారంభం కాగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు.

డీసీసీబీ డైరెక్టర్ పరామర్శ

అశ్వాపురం: అనారోగ్యంతో భద్రాచలంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశ్వాపురం మండలానికి చెందిన బోయపాటి రామ్మోహన్‌రావును గురువారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ముత్తినేని సుజాత, పొంగులేటి శ్రీనన్న సైన్యం మండల కన్వీనర్ ముత్తినేని వాసు, మాజీ సర్పంచ్ పొడియం అనిల్, నాయకులు వేములపల్లి రమేష్, బొబ్బాల నాగేష్, గొల్లపల్లి నరేష్‌కుమార్, బైగాని శివ పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటిగా గ్రామాల్లోని మహిళలంతా కలిసి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ, బోనాలతో ఆటపాటల నడుమ చెరువుల వద్దకు చేరుకున్నారు. బతుకమ్మ ఆటలు, డీజే పాటలతో సందడి చేశారు. చెరువుల వద్ద గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలు, కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చిందని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రజలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేస్తున్న మహిళలు



కరకగూడెం: మహిళలతో కలిసి బతుకమ్మలతో వస్తున్న విప్ రేగా కాంతారావు



దమ్మపేట: బతుకమ్మలతో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



అశ్వారావుపేటరూరల్: బతుకమ్మను ఎత్తిన ఇరిగేషన్ ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ



గుండాల: సంప్రదాయ నృత్యాలతో వస్తున్న మహిళలు



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఎంపీపీ రేసు లక్ష్మి



మణుగూరురూరల్: బోనాలతో ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు



అశ్వాపురం: తుమ్మలచెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న జెడ్పీటీసీ సులక్షణ, ఇతర నేతలు



చంద్రుగొండ: గంటే వీరయ్యకుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



చర్ల: పెద్దచెరువు వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. గురువారం స్థానిక సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఆళ్ల నాగరాజు, సర్పంచ్ సోడి పుల్లయ్య, చేతుల మీదుగా జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఈఓ పి.శివరాంప్రసాద్ మాట్లాడారు. కార్యాకరమంలో సహకార సంఘం సీఈఓ దొడ్డి రామచంద్రప్రభు, రైతులు దినసరపు సంజీవరెడ్డి, ఇందుల రమేష్‌బాబు, ఇందుల బుచ్చిబాబు, సత్యనారాయణరాజు, లక్ష్మీపతిరాజు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు అమలు చేయాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ కన్వేనియన్స్ వాహన డ్రైవర్లకు సెంట్రల్ జీవో ప్రకారం పెరిగిన వేతనాలను అమలు చేసి, వేతన బకాయిలను ఇవ్వాలని డ్రైవర్లు కోరారు. ఈ మేరకు ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా మాట్లాడుతూ.. ప్రైవేట్ కన్వేనియన్స్ వాహన డ్రైవర్ల వేతనాలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంటనే వేతనలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు మంగీలాల్, భావ్‌సింగ్, గోవిందుల శ్రీనివాసరావు, రజబ్ అలీ, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి



కరకగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న ఇఖ్బాల్ హుస్సేన్

కరకగూడెం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు హెల్త్ సబ్ సెంటర్లలో సరైన వైద్య సదుపాయాలు వెంటనే కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారని, ఆ బాధతో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే అక్కడ సరైన సదుపాయాలు ఉండడం లేదని అన్నారు. ప్రభుత్వం, పాలకులు స్పందించి ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగబండి వెంకటేశ్వర్లు, నాయకులు బైరిశెట్టి రామరావు, గోగు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

11న ఆత్మీయ సమ్మేళనం

మణుగూరురూరల్: ఈ నెల 11న తెలుగుదేశం పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని కరకగూడెం మండలం రాళ్లవాగు సమీపాన పెద్దమ్మతల్లి ఆలయ సన్నిధిలో నిర్వహించనున్నట్లు సమితిసింగారం పంచాయతీ సర్పంచ్ బచ్చల భారతి గురువారం తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పోరుగర్జనను జయప్రదం చేయాలి



మణుగూరురూరల్: ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

మణుగూరురూరల్: ఈ నెల 11వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో చలో కొత్తగూడెం పేరిట జరిగే ప్రజా పోరుగర్జన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు అర్.లక్ష్మీనారాయణలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ మండల, పట్టణ నాయకులు బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేస్తూ.. ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో పార్టీ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందే కుటుంబరావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి అక్కి నర్సింహరావు, సర్పంచ్ బాడిశ సతీష్, ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, లక్ష్మయ్య, చంద్రం, ఎస్‌కె.సర్వర్, మంగివీరయ్య, కణితి సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, నాగరాజు, రాంనర్సయ్య, ఎస్వీ నాయుడు, చింతల దశరథం తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని కోరుతూ.. సీపీఐ మహిళ నేతలు గురువారం దమ్మపేట గ్రామంలో ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో శాంతి, జాన్‌బీ, నాగమణి, రాధిక, నిర్మల, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ కోరారు. గురువారం భద్రాచల పట్టణంలో నిర్వహించిన సీపీఐ పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, శివప్రసాద్, నరసింహులు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్, మహిళా సంఘం డివిజన్ నాయకురాలు ముప్పా రామలక్ష్మి, ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ నాయకులు మారెడ్డి గణేష్, నాగరాజు, తిరుపతిరావు, ఖాదర్ ప్రదీప్, నాగరాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించతలపెట్టిన ప్రజాగర్జన సభకు ఆటోడ్రైవర్లు, ఓనర్లు వందలాదిగా కదిలి రావాలని ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రం చంద్రుగొండలో గురువారం ఆటోవర్కర్స్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జడ శ్రీను, బొర్రా కేశవులు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు జహీర్‌హుసేన్, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భద్రాద్రిలో మృగశిర సందడి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మృగశిర కార్తె సందర్భంగా మార్కెట్‌తో పాటు పలు ప్రాంతాల్లో గురువారం చేపల కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కొత్త మార్కెట్‌తో పాటు చర్ల రోడ్, కూనవరం రోడ్, ఐటీడీఏ రోడ్‌లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మృగశిర కార్తె రోజున తప్పనిసరిగా చేపలు తినాలనే నానుడి ఉండడంతో అధిక ధరలు ఉన్నా ప్రజలు కొనుగోలుకు వెనుకాడలేదు. నిత్యం కిలో రూ.200 నుంచి రూ.230 వరకు ఉండే చేపల ధరలు అమాంతం రూ.300 నుంచి రూ.400 వరకు పెరిగాయి. ఇక కొరమీను కిలో ధర వెయ్యి రూపాయలకు చేరుకుంది. గోదావరి చేపలను సైతం భారీ ధరలకు వ్యాపారులు విక్రయించారు.

దుమ్ముగూడెం: మృగశిర కార్తె రాకతో చేపల మార్కెట్లు సందడిగా మారాయి. సాధారణ రోజుల్లో కేజీ రూ.200 ఉండే చేపలు.. మృగశిర కార్తె రోజున రూ.400లకు పెరిగాయి. అయినప్పటికీ ప్రజలు మార్కెట్‌ల వద్ద క్యూ కట్టారు.



భద్రాచలంటౌన్: రోడ్డు వెంబడి చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

కోర్టు పనులు ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రం శివారులోని ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు పనులను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కోర్టు ఏర్పాటుకు రూ. 20లక్షల నిధిని ఖర్చు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం జెడ్పీ నిధుల నుంచి రూ.5 లక్షలు, ఎంపీటీసీల నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, సత్తుపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకట్రావు, బీఆర్‌ఎస్ నాయకులు యార్లగడ్డ బాబు, చిట్టిబాబు, వీరయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా హెల్త్‌క్యాంపులు

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యబృందం ఆధ్వర్యంలో మారాయిగూడెం గ్రామంలో గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటి ఫీవర్ సర్వేను చేపట్టగా ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అలాగే 10 మంది రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ల్యాబ్‌లో నమోదైన డెంగ్యూ కేసులను పరిగణలోకి తీసుకుని ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో 57 రకాల రక్త నమునాలు సేకరిస్తారని, ఆ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మారాయిగూడెం గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు. పరిమితికి మించి మందులు కలిగి ఉండటంతో పాటు పరిమితికి మించి వైద్యం చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుల్లారెడ్డి, వైద్య సిబ్బంది సాగర్, నరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు, మరో వైద్యాధికారి బైరిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో కొత్తగూడెం, కరకగూడెం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి మందులను అందజేశారు. ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి రోగ లక్షణాలను బట్టి అవసరమైన వారికి అక్కడే వైద్యం అందించారు. అలాగే నాలుగు సూపర్‌వైజర్ బృందాలు ఒక్కొక్క టీం తాటిగూడెం, రేగళ్ల, పద్మాపురం, భట్టుపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య శిబిరాల్లో ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: బాధితురాలికి సెలైన్ ఎక్కిస్తున్న వైద్యసిబ్బంది



కరకగూడెం: ఓ ఇంటివద్ద వైద్యం అందిస్తున్న వైద్యాధికారి మధు

కార్మికులు ఐక్యంగా ఉండాలి

మణుగూరురూరల్: హక్కుల సాధనకు బొగ్గు ముఠా కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య పిలుపునిచ్చారు.

గురువారం బొగ్గు ముఠా సంఘ కార్యాలయంలో నిర్వహించిన పదో మహసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న కొత్తగూడెంలో జరిగే బహిరంగ సభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి అక్కి నరసింహారావు, ఎస్‌కె.సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బొగ్గు ముఠా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాకుళం వీరమల్లు, కార్యదర్శిగా జక్కుల రాజబాబు, కోశాధికారిగా లింగస్వామిలను, హెడ్ మేస్త్రీలుగా, కమిటీ సభ్యులుగా కనతాల కోటయ్య, రాము, భాస్కర్, కుంట వీరన్న, సతీష్, సంపత్‌లను ఎన్నుకున్నారు.

మున్సిపాలిటీలో సమస్యల తిష్ట

- సైడ్ డ్రెయిన్‌లలో మురికినీరు నిల్వ
- చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న రోడ్లు
- సకాలంలో అందని తాగునీరు
- నిర్లక్ష్య ధోరణిలో మున్సిపల్ అధికారులు



అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ



మురుగునీటితో దర్శనమిస్తున్న కట్టువాగు

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలో పలు సమస్యలు గత కొద్ది కాలంగా తిష్టవేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం, అన్నారం, చినరాయిగూడెం, భగత్‌సింగ్‌నగర్, శేషగిరినగర్, ఆదర్శ్‌నగర్, సుందరయ్యనగర్, శ్రీశ్రీనగర్ ఏరియాల్లో రోడ్లపై చెత్త దుర్వాసనతో దర్శనమిస్తోంది. చెత్త రోడ్లపై ఉండడం వల్ల స్థానిక ప్రజలు దుర్వాసనతో అస్వస్థతకు గురవుతున్నారు. ఇదే ప్రాంతాల్లో సైడ్ డ్రెయిన్‌లలో అధిక మొత్తంలో మురికినీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఫలితంగా స్థానిక ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా ఎస్‌బీఐ వద్ద ఉన్న కట్టువాగులో చెత్త, బురదనీరు ఎక్కువగా ఉండడం వల్ల పలు పనులపై రాకపోకలు చేసే వాహనదారులకు, పాదాచారులకు దుర్వాసనతో మణుగూరు పట్టణం స్వాగతం పలుకుతోంది. గతంలో పలుమార్లు ఈ కట్టు వాగును శుభ్రపర్చాలని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అధికారులకు ఎన్నిసార్లు సూచనలు చేసినా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు మాత్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు.

మున్సిపాలిటీలోని సుందరయ్యనగర్, ఆదర్శ్ నగర్‌లోని సీసీరోడ్లపై చెత్త విపరీతంగా ఉన్నా.. మున్సిపాలిటీ అధికారులు నామమాత్రంగా తమ విధులను నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సైడ్ డ్రెయిన్‌లలో నిలిచిన బురదనీటిని తీసివేయడంలో అధికారులు ఏమాత్రం చొరవ చూపడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అసలు సైడ్ డ్రెయిన్లు ఉన్నాయా..లేవా అన్న రీతిలో రోడ్లకు సమాంతరకంగా ఉండి మట్టికుప్పలతో ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా తుమ్మ మొక్కలు విపరీతంగా పెరిగి పలు పనులపై సంచరించే వారికి తీవ్ర ఆటంకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి పన్ను వసూలుకు వెళ్లినప్పుడు బిల్ కలెక్టర్లు, స్థానిక ప్రజలకు మధ్య ఘర్షణలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. అయినప్పటికీ మున్సిపాలిటీ అధికాల్లో ఆశించిన మేరకు స్పందన లేదు. ఇప్పటికైనా వారు చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో చెత్తను తీసివేయాలి

మున్సిపాలిటీ రోడ్లపై పేరుకుపోతున్న చెత్తను సకాలంలో తీసివేసి శుభ్రపర్చాలి. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా చూడాలి. మున్సిపాలిటి అధికారులు పన్నులే కాకుండా ప్రజారోగ్యంపై కూడా దృష్టి సారించాలి.

– బీఎస్ రాములు, రాజుపేట

బురదనీటిని తొలగించాలి

మున్సిపాలిటీ పరిధిలో సైడ్ డ్రెయిన్లలో నిల్వ ఉంటున్న బురద నీటిని తీసివేస్తే దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయి. బురదనీరు, చెత్త ఎప్పటికప్పుడు శుభ్రపరిస్తే స్థానిక ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడే దుస్థితి ఉండదు.

– తుంపిరి కమల్, రాజుపేట